TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 46 సోమవారం 21-09-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వెల:2.00/-

## హెచ్ఐవీ చికిత్సలో గోలీల కన్నా ఇంజెక్షన్లే బెటర్!

**లండన్ సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**

హెచ్ఐవీతో జీవిస్తున్న యువతలో రోజూ గోలీలు వేసుకోవడం కంటే ప్రతి ఎనిమిది వారాలకు ఒకసారి ఇచ్చే యాంటీరెట్రోవైరల్ థెరపీ(ఏఆర్టీ) ఇంజెక్షన్లు మెరుగైన ఫలితాలను ఇస్తున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ పరిశోధన వివరాలు ది లాన్సెట్ వైద్య జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. యూనివర్సిటీ కాలేజ్ లండన్(యూసీఎల్) పరిశోధకులు ఆఫ్రికాలో నిర్వహించిన క్లినికల్ ట్రయల్‌లో ఈ విషయాన్ని గుర్తించారు. రోజూ తీసుకునే మాత్రలతో పోలిస్తే ఇంజెక్షన్ల ద్వారా హెచ్ఐవీ వైరస్‌ను అణచివేయడం సమర్థవంతంగా ఉన్నట్లు తేలింది.



# నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని

## బహుజన రాజ్యం రావాలంటే కాంగ్రెస్ ను గద్దె దించాల్సిందే

- సాయిత్రి భాయి పూలే ఆశయాలు నింపుకొని మగ మహారాజులకు ఛాలెంజ్ చేస్తున్న వీరవనితను నేను
- నన్ను ఆశీర్వదిస్తే రేవంత్ రెడ్డి, కేసీఆర్, మోడీతో పోరాడుత
- ఈ ముఖ్యమంత్రి బలవంతుడినని దురహంకారంతో వీర్రవీగుతున్నాడు
- బలవంతమైన సర్పం చలి చీమల చేతిలో చిక్కి చచ్చినట్లే ఆయనకు పరాభావం తప్పదు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**కోస్గీ - కొడంగల్ :సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**

"నేను బహుజనుల బాణాన్ని.. యువజనుల యుద్ధ నినాదాన్ని.. అంబేద్కర్ వాదాన్ని. పూలే గారి ఆత్మగౌరవ నినాదాన్ని.. సాయిత్రి భాయ్ పూలే ఆశయాలను నింపుకొని నిటారుగా నిలబడి మగమహారాజులకు ఛాలెంజ్ విసురుతున్న వీరవనితను నేను" అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తనను బీఆర్ఎస్ వదిలిన బాణమని కొంతమంది, కాంగ్రెస్ బాణం అంటూ మరికొంతమంది చేస్తున్న విమర్శలకు కొడంగల్ వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గీలో ఆదివారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో కవిత మాట్లాడారు. తాను బహుజనుల బాణాన్ని అని చెప్పారు. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే రేవంత్ రెడ్డి, కేసీఆర్, మోడీలతో పోరాటం చేసి చూపిస్తానన్నారు. ఎవరి మద్దతు లేకుండా ఒక మహిళ రాజకీయంగా ఎదగగలదని నిరూపిస్తానన్నారు. ఇన్నాళ్లు అయ్యాల పాలనలో ఒరిగిందేమీ లేదని ఇక తెలంగాణలో మాతృస్వామ్యం తెచ్చుకోవాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ తెచ్చుకున్న తర్వాత బీఆర్ఎస్ కు, కాంగ్రెస్ అవకాశం ఇస్తే చేసేందేమీ లేదన్నారు. తనకు అవకాశం ఇస్తే ఒక తల్లిలాగా ఆలోచించి పాలన సాగిస్తానన్నారు.

**ప్రజల కోసమే పార్టీ పెట్టా**

తెలంగాణలో మాతృస్వామ్యాన్ని తెచ్చుకోవాల్సిన అవసరముందని కవిత అన్నారు. ఇన్నాళ్లు అయ్యాలు చేసిన పాలనలో మన బతుకులు ఏం మారాయో ఒక్కసారి ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణ రాకముందు జరిగిన అన్యాయానికి ఆంధ్రోళ్లు బాధ్యులని అనుకున్నామని కానీ తెలంగాణ వచ్చిన 12 ఏళ్లలో మన బతుకులు ఏం మారాయని ప్రశ్నించారు. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు వంచనకు గురయ్యారన్నారు. బాధ్యతలేని పార్టీలు, నాయకుల కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ ప్రజల కోసం కదనరంగంలో యుద్ధం చేసే నాయకుల అవసరముందన్నారు. అందుకోసం తాను పార్టీ పెట్టి మీ ముందుకు వచ్చానని చెప్పారు. తనకోసమో, కొంతమంది నాయకుల కోసమో పార్టీ పెట్టలేదని, తెలంగాణ ప్రజల జీవితాలను మార్చేందుకే తెలంగాణ రక్షణ సేన పెట్టానని చెప్పారు. కోస్గీకి తాను 2009 లో టీడీపీతో పొత్తులో భాగంగా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలతో కలిసి వచ్చానని అన్నారు. వాళ్లిద్దరూ కూడా ముఖ్యమంత్రులు అయ్యారని తెలంగాణ ప్రజల ఆశీర్వాదం ఉంటే తాను కూడా రాష్ట్రాన్ని నడిపిస్తాననే విశ్వాసం ఉందన్నారు.

**పాంచజన్యంతో ప్రజల జీవితాల్లో వెలుగులు**

సమాజంలో ఆధర్మం పెరిగిపోయినప్పుడు శ్రీకృష్ణుడు పాంచజన్యం ఊది ధర్మపోరాటాన్ని చేస్తారని....తాము కూడా తెలంగాణ రక్షణ సేన ద్వారా అదే పనిచేయబోతున్నామని చెప్పారు. తెలంగాణ ప్రజలు విద్య కోసం రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. జనంబాటలో నాగర్ కర్నూల్ ప్రభుత్వ హాస్పిటల్ కు వెళ్తే అక్కడి పరిస్థితిని ఓ మహిళ తనకు చెబుతుంటే ఎంతో ఆవేదన చెందానన్నరు. తన బిడ్డకు పుట్టిన బిడ్డను చూడాలంటే వెయ్యి రూపాయలు లంచం అడిగారని ఆమె చెప్పిందన్నారు. ఇదేనా మనం కోరుకున్న తెలంగాణ అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక ఎంత పెద్ద జబ్బైనా సరే ఒక్క రూపాయి కూడా ప్రజలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. తాను ఇవ్వన్నీ చెబుతుంటే కొంతమంది చిన్నపిల్ల, ఆడబిడ్డ అంటూ నవ్వుతున్నారని కవిత అన్నారు. కానీ తాను ఒక తల్లిని అని తల్లి హృదయంతో ఆలోచిస్తానని చెప్పారు. విద్య, వైద్యం కోసం లక్ష కోట్లు ఖర్చు అయినా పర్వాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూత్ ను నమ్మొద్దు అంటున్నాడు. మరి ఆయన బూతులను నమ్మాలా అని ప్రశ్నించారు. మన యువతను నమ్మి వారి బిజినెస్ ఐడియాలను ప్రోత్సహించేందుకు 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామన్నారు.

**పదిలక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోతే పేరు మార్చుకుంటా**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి పై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా, కరెంట్, నీళ్లు, రైతు భరోసా, మద్దతు ధర ఇలా ప్రతి దానికి రైతులు బాధపడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. అధికారుల కాళ్లపై పడి రైతులు వేడుకుంటున్న సంఘటనలు హృదయాన్ని కలిచివేస్తున్నాయన్నారు. రైతులకు కనీసం సాగు నీళ్లు ఇవ్వటం కూడా ఈ ప్రభుత్వానికి చేతకావటం లేదని విమర్శించారు. జురాల వద్ద రెగ్యులేటర్ ను పగలకొట్టి రైతులు నీళ్లు తీసుకునే పరిస్థితి వచ్చిందంటే ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. జురాల నుంచి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసే అవకాశం ఉన్న సరే చేయటం లేదని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక జురాల నుంచి నీటిని ఎత్తిపోసి కొడంగల్, మక్తల్, నారాయణ్ నుంచి ఇబ్రహీం పట్నం వరకు 10 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని భరోసా ఇచ్చారు. లేదంటే పేరు మార్చుకుంటానని సవాల్ విసిరారు.

**బలవంతుడినని వీర్రవీగుతున్న ముఖ్యమంత్రి**

రాష్ట్రంలో సామాజిక అన్యాయం జరుగుతోందని కవిత అన్నారు. ఏ వర్గానికి కూడా వారి జనాభాకు తగిన విధంగా అవకాశాలు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ముఖ్యమంత్రి బలవంతుడనని వీర్రవీగుతున్నాడని...కానీ బలవంతమైన సర్పం చలిచీమల చేతిలో చనిపోయినట్లుగా ఆయనకు పరాభవం తప్పదన్నారు. రాష్ట్రంలో లంబాడాలు లేని తొలి ప్రభుత్వం ఇదేనని ఆమె చెప్పారు. ముస్లింలకు కూడా మొన్నటి వరకు కేబినెట్ లో అవకాశం ఇవ్వలేదన్నారు. గత మూడేళ్లలో ముస్లింల కోసం ఈ ప్రభుత్వం ఖర్చు చేసింది 1500 కోట్లు మాత్రమేనని అన్నారు. లగచర్లలో లంబాడాలపై ఈ ముఖ్యమంత్రి చేసిన దాష్టీకాలను ప్రజలు మర్చిపోలేదన్నారు. మక్తల్ లో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దన్న టీచర్, రైతులపై రౌడీ షీట్ ఓపెన్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై పోరాటం చేసినందుకు గత ప్రభుత్వంలో, ఈ ప్రభుత్వంలో నర్సింహులు అనే రైతును పోలీసులు కొట్టి చంపారని ఆవేదనతో చెప్పారు. కుమ్మెర గ్రామంలో 2 నెలల చాకలి సామాజిక వర్గం చిన్నారి చనిపోతే ఇప్పటికీ చర్యలు లేవన్నారు. రాష్ట్రంలో సామాజిక అన్యాయం జరుగుతోందని చెప్పారు. ఈ పరిస్థితి మారాలంటే బహుజనం రాజ్యం రావాలంటే కచ్చితంగా కాంగ్రెస్ ను గద్దె దించాల్సిందేనని అన్నారు. బీసీలకు, యువతకు అవకాశం ఇస్తున్న తమ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

**కొడంగల్ లో ఇందిరమ్మ ఇళ్లకు కూడా డబ్బులు అడుగుతున్నారు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు కూడా డబ్బులు అడుగుతున్నారని కవిత చెప్పారు. ఇప్పటికీ నీళ్లు రాని ఎన్నో గ్రామాలు ఉన్నాయని, రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందని చెప్పారు. ఆయన తీసుకొచ్చిన ఇంజనీరింగ్ కాలేజ్ మళ్లీ వెనక్కి వెళ్లిందన్నారు. గట్టు, కేటిదొడ్డు మండలాల్లో అఫ్ఘనిస్తాన్ తో సమానంగా అక్షరాస్యత ఉందని...అందుకు సీఎం సిగ్గుపడాలన్నారు. విద్యా శాఖ మంత్రిగాను ఉన్న ముఖ్యమంత్రి రెండేళ్లలో పరిస్థితి మార్చాలని డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలో ప్రజలు కాంగ్రెస్ కు 13 సీట్లు ఇస్తే ఎమ్మెల్యేలు ఇసుక, మట్టి, ఇందిరమ్మ ఇండ్లలో డబ్బుల దందా చేస్తున్నారని కవిత విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోని ఈ కాంగ్రెస్ పార్టీని గద్దె దించాలని కోరారు.

**కవిత నోట గద్దర్ పాట**

కోస్గీ సభలో గద్దర్ పాటతో కవిత ఆకట్టుకున్నారు. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాల తీరు గురించి చెబుతూ ఆమె గద్దర్ పాటను పాడారు. భలే గుంది అసెంబ్లీ అంటూ గద్దర్ గతంలో పాడిన పాటను పాడి వినిపించటంతో ప్రజలంతా పెద్ద ఎత్తున చప్పట్లతో హోరెత్తించారు.

**కిక్కిరిసిన సభ ప్రాంగణం**

కోస్గీ సభ ప్రాంగణం వేలాది మంది ప్రజలతో కిక్కిరిసి పోయింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి కవిత రాకకోసం జనం సభ ప్రాంగణానికి చేరుకున్నారు. సభ ప్రారంభమయ్యే సరికి ఆ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసిపోయింది. అంతకుముందు హైదరాబాద్ నుంచి కొడంగల్ కు 200 కార్లతో టీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా వచ్చారు. హైదరాబాద్ లోని అప్పా జంక్షన్ నుంచి కోస్గీ వరకు టీఆర్ఎస్ నాయకులు, మహిళలు కవితకు అడుగడుగునా మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. కొడంగల్ నుంచి కోస్గీ వరకు 20 కిలీమీటర్ల దూరం కవిత ప్రత్యేక బస్సులో ప్రయాణించి సభ ప్రాంగణానికి చేరుకున్నారు. కోస్గీ చౌరస్తాలో తెలంగాణ రక్షణ సేన జెండాను కవిత ఆవిష్కరించారు.

**సీఎం .. సీఎం నినాదాలతో మార్మోగిన సభ ప్రాంగణం**

కోస్గి కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ ప్రాంగణం సీఎం సీఎం నినాదాలతో మార్మోగింది.. కల్వకుంట్ల కవిత మాట్లాడేందుకు ముందుకు వచ్చిన సమయంలో ప్రాంగణంలో ఉన్న నాయకులు, కార్యకర్తలు సీఎం సీఎం అని నినాదాలు చేశారు.

**చంద్రబాబు, రేవంత్ తర్వాత నేనే సీఎం**

2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే కోస్గి కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో తాను, చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి మహా కూటమి తరపున ప్రకారం చేశామని గుర్తు చేశారు. ఆ రోజు కోస్గి సభలో పాల్గొన్న చంద్రబాబు, రేవంత్ రెడ్డి సీఎంలు అయ్యారని.. వచ్చే ఎన్నికల్లో గెలిచి తాను సీఎం అవుతానని ధీమా వ్యక్తం చేశారు.



# సౌదీకి సాయం చేస్తే ఖబడ్దార్..

- పాకిస్థాన్, టర్కీలకు హౌతీల వార్నింగ్
- సౌదీకి సైనిక సాయం చేస్తే ఉక్కుపిడికిలితో బదులిస్తామని హెచ్చరిక
- పాకిస్థాన్, టర్కీ తటస్థంగా ఉండాలని హౌతీల సూచన
- యుద్ధంలో జోక్యం చేసుకుంటే రెండు దేశాలపైనా దాడులంటూ వార్నింగ్
- సౌదీ, పాక్, టర్కీ మధ్య రక్షణ ఒప్పందంపై హౌతీల ఆగ్రహం
- మూడు దేశాల్లో ఏ ఒక్కరిపై దాడైనా అందరిపై దాడిగానే ఒప్పందం
- సౌదీ భూభాగ రక్షణకు సిద్ధమని పాక్ ప్రకటన
- సౌదీకి సైనిక, సాంకేతిక సాయం అందించేందుకు టర్కీ సంసిద్ధత
- సౌదీ ఇంధన వనరులు, నగరాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు



03

# ఇరాన్ యుద్దానికి అమెరికా ఖర్చు రూ.4.32 లక్షల కోట్లు

- ఏడు నెలల్లో 45.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు ని కాంగ్రెస్‌కు ట్రంప్ ప్రభుత్వం వెల్లడి
- యుద్ధం కోసం 43.6 బిలియన్ డాలర్ల వ్యయం
- చమురు కోసం మరో 1.5 బిలియన్ డాలర్లు ఖర్చు
- ఫిబ్రవరి 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు లెక్కలు
- ఇప్పటి ఖర్చు అంచనా మాత్రమేనని ప్రభుత్వం స్పష్టీకరణ
- ధ్వంసమైన స్థావరాలు, భవనాల మరమ్మతు ఖర్చులు ఇందులో లేవు
- క్షిపణుల అడ్డుగోలు వ్యవస్థలకే భారీగా వ్యయం
- చమురు సరఫరా సమస్యలతోనూ ఆర్థిక భారం
- యుద్ధం కొనసాగితే ఖర్చు మరింత పెరిగే అవకాశం



03



# ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

- దసరా పండుగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రకటన
- చర్లపల్లి - శ్రీకాకుళం మధ్య మొత్తం 16 సర్వీసులు
- అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి
- విజయవాడ, రాజమండ్రి, విజయనగరం మీదుగా ప్రయాణం
- చర్లపల్లి - నాగర్కోయిల్ మార్గంలో మరో 10 ప్రత్యేక సర్వీసులు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి

దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లి – శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. షెడ్యూల్ వివరాల ప్రకారం.. రైలు నంబర్ 07037 (చర్లపల్లి – శ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతో పాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళం – చర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 మరియు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ,

-మిగతా 3 లో

# ప్రైవేట్ భూముల్లోకి కాంగ్రెస్ లీడర్లా..

## ఫామ్‌హౌస్‌లు ఏమైనా టూరిస్ట్ కేంద్రాలా

### భూదోపిడీ ఆధారాలు ఉంటే వెల్లడించండి

### కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 20

: ప్రైవేట్ భూముల్లోకి వెళ్లే అధికారం కాంగ్రెస్ నేతలకు ఎవరిచ్చారని, ఫామ్‌హౌస్‌లు ఏమైనా టూరిస్ట్ కేంద్రాలా అంటూ కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కరీంనగర్ నగరపాలకసంస్థ కార్యాలయ ఆవరణలో ఆదివారం మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల ఫామ్‌హౌస్ సందర్శన పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఫాంహౌస్ భూములను సందర్శిస్తే అర్థం చేసుకోవచ్చు గానీ, అధికారం కాంగ్రెస్ చేతుల్లోనే ఉంది కదా అని నేతలు ఫామ్‌హౌస్ భూముల సందర్శనకు వెళ్లడం ఏందని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లో ఒకవేళ సరార్ భూములుంటే తక్షణమే స్వాధీనం చేసుకొనే హకు ప్రభుత్వానికి ఉన్నదని తెలిపారు.బీఆర్ఎస్ నేతలు రూ.లక్ష కోట్ల భూదోపిడీ చేసినట్లు ఆధారాలుంటే ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలకు భయపడే కాంగ్రెస్ అనర్హత కేసులో స్టే కోసం సుప్రీంకోర్టుకు వెళ్లిందని విమర్శించారు. ఉప ఎన్నికలొస్తే కాంగ్రెస్‌ను రాజకీయ నిమజ్జనం చేయడం తథ్యమని జోస్యం చెప్పారు. ఉప ఎన్నికల్లో పోటీ బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ను జనం అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. దానం నాగేందర్ తనను ఖైరతాబాద్ వినాయకుడితో పోల్చుకోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నదని, అయితే వినాయకుడిని చివర్లో నిమజ్జనం చేస్తారనే విషయాన్ని గుర్తు పెట్టుకుంటే బెటర్ అని సూచించారు. 22ఏతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను పరిషరించకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు



03

## రష్యాపై విరుచుకుపడిన ఉక్రెయిన్

- 1,600కుపైగా డ్రోన్లతో దాడి.. ఇద్దరు మృతి, పలువురికి గాయాలు
- ధ్వంసమైన ఆయిల్ రిఫైనరీలు.. ఎగసిపడిన మంటలు
- టార్గెట్లలో పారిశ్రామిక, లాజిస్టిక్ పార్కులు
- నివాస భవనాలపైనా దాడులు.. పలువురు మృతి
- 450 డ్రోన్లను కూల్చేశాం.. మాస్కో మేయర్ ప్రకటన
- దాడుల వీడియోలను విడుదల చేసిన జెలెన్‌స్కీ
- పార్లమెంట్ ఎన్నికల వేళ ఉద్రిక్తతలతో ఆందోళన

## ఇటలీ పాఠశాలల్లో బుర్ఖా, నిఖాబ్‌పై నిషేధం



03

## విదేశాంగ శాఖ మంత్రికి 'సర్' నోటీసు..!



03



# 17 ఏండ్లలో లేనంతగా కరువు

- ఎల్ నినోతో 15 శాతం లోటు వర్షపాతం నమోదు
- తెలంగాణలో 22%, ఏపీలో 45% తక్కువగా రికార్డు
- కర్ణాటకలో 31 శాతం.. కేరళలో 28 శాతం లోటు
- శనివారం నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభం
- పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం.. రైతులకు ఇబ్బందులు
- బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీ, ఒడిశాలో వర్షాలకు అవకాశం

03

ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది దేశాన్ని వర్షాభావం వెంటాడింది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం నమోదవగా, దక్షిణ ద్వీపకల్పంలో ఏకంగా 28 శాతం తక్కువ వర్షాలు కురిశాయి. 17 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా కరువు పరిస్థితులు నెలకొనడంతో పంటల దిగుబడులు దెబ్బతిని రైతులు, సాగు-తాగునీటి సమస్యలను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లోనే శనివారం పశ్చిమ రాజస్థాన్ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది.

## దళితుల భూమి ఒక్క అంగుళం

# తీసుకోం



**దళిత, గిరిజనుల భూములకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ**

- దళితుల భూములు లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని స్పష్టీకరణ
- భూముల విషయంలో ఎవరూ భయాందోళన చెందొద్దని పొంగులేటి భరోసా
- దళితులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్‌దేనని వ్యాఖ్య
- ఇందిరమ్మ హయాంలో సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ
- గిరిజనులకు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై హక్కులు
- సూర్యాపేట, మహబూబాబాద్‌లో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం
- దళితులను రెచ్చగొట్టేందుకు విషప్రచారం చేస్తున్నారన్న మంత్రి

హైదరాబాద్

దళిత, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు సంబంధించిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోబోదని భరోసా ఇచ్చారు. దళితుల భూములకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్

-మిగతా 3 లో



03

## పాక్ సైన్యంలో భారీ మార్పులు

- ఐఎస్ఐలో కీలక అధికారుల బదిలీలు, నియామకాలు
- డీజీఎస్‌గా షమైజ్ ఖాన్‌కు బాధ్యతలు
- భారత్‌కు సంబంధించిన కార్యకలాపాలను పర్యవేక్షించే విభాగం
- మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అదిల్ వారియాచ్
- వాజిద్ అజీజ్‌ను పదవి నుంచి తొలగించినట్లు సమాచారం
- ఖుర్రం షబ్బీర్‌కు 17 డివిజన్ బాధ్యతలు
- డీజీ-జెడ్‌గా సాజిద్ అమిన్ అవాన్ నియామకం
- షమైజ్ ఖాన్‌కు భారత్ సరిహద్దు కార్యకలాపాల్లో అనుభవం



## తెలంగాణకు భారీ వర్ష సూచన

- మూడు రోజులు అప్రమత్తం
- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణకు వర్ష సూచన
- రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- సోమవారానికి వాయుగుండంగా, మంగళవారానికి తీవ్ర వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
- 24న పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని

-మిగతా 3 లో



# 'నేను పౌరుడిని కానా?'

న్యూఢిల్లీ:

ఎన్నికల సంఘం ప్రస్తుతం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ అని రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'సర్' ప్రక్రియలో తనకు నోటీసు రావడంపై ఆయన ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. తాను నమోదైన ఓటరునని, ఎంపీగా ఉన్నప్పటికీ తన పౌరసత్వంపై అనుమానం ఉన్న వ్యక్తిగా ఎలా పరిగణించారని నిలదీశారు.ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో తన ఓటు పట్నాలో ఉండేదని, 2004 వరకు రాజ్యసభ సభ్యునిగా ఉన్న సమయంలో తన పేరు అక్కడి జాబితాలో ఉన్నదన్నారు. బూత్ స్థాయి అధికారి వచ్చినప్పుడు అవసరమైన వివరాలన్నీ అందించానని, ఫారమ్‌పై తన ఫొటోతో పాటు బీఎల్‌వో సంతకం కూడా ఉన్నదన్నారు. తన ఫోన్ నంబర్ ఎన్నికల అధికారుల వద్ద ఉన్నప్పుడు నేరుగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఢిల్లీలో సుమారు 1.45 కోట్ల మంది ఓటర్లలో 63 లక్షల మంది పేర్లు తొలగించారని, దాదాపు 32 లక్షల మందికి నోటీసులు జారీ చేశారని చెప్పారు.

# సౌదీకి సాయం చేస్తే ఖబడ్దార్..

**- పాకిస్థాన్, టర్కీలకు హౌతీల వార్నింగ్**
**-సౌదీకి సైనిక సాయం చేస్తే ఉక్కుపిడికిలితో బదులిస్తామని హెచ్చరిక**
**-పాకిస్థాన్, టర్కీ తటస్థంగా ఉండాలని హౌతీల సూచన**
**-యుద్ధంలో జోక్యం చేసుకుంటే రెండు దేశాలపైనా దాడులంటూ వార్నింగ్**
**-సౌదీ, పాక్, టర్కీ మధ్య రక్షణ ఒప్పందంపై హౌతీల ఆగ్రహం**
**-మూడు దేశాల్లో ఏ ఒక్కరిపై దాడైనా అందరిపై దాడిగానే ఒప్పందం**
**-సౌదీ భూభాగ రక్షణకు సిద్ధమని పాక్ ప్రకటన**
**-సౌదీకి సైనిక, సాంకేతిక సాయం అందించేందుకు టర్కీ సంసిద్ధత**
**-సౌదీ ఇంధన వనరులు, నగరాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు**



న్యూఢిల్లీ
యెమెన్ కు చెందిన హౌతీ రెబల్స్.. పాకిస్థాన్ , టర్కీ దేశాలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. సౌదీ అరేబియా కు మద్దతుగా సైనిక బలగాలను పంపినా లేదా ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నా 'ఉక్కు పిడికిలి' తో బదులిస్తామని స్పష్టంచేశారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య ఇటీవల కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఈ హెచ్చరికలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి.హౌతీ అన్సార్ అల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడు మహ్మద్ అల్-బుఖైతీ ఇటీవలి ఇంటర్వ్యూలలో ఈ హెచ్చరికలు చేశారు. 'దేవుడి సాక్షిగా చెబుతున్నా. ఒకవేళ పాకిస్థాన్, టర్కీ ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంటే, మేము వారిపై ఉక్కు పిడికిలితో విరుచుకుపడతాం' అన్నారు. సౌదీ అరేబియాకు బుద్ధి చెబుతున్నట్లే, ఆ రెండు దేశాలకు కూడా క్రమశిక్షణ నేర్పుతామని వ్యాఖ్యానించారు. తాము సౌదీ నేతృత్వంలోని సైనిక చర్యలు, ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ పోరాటమే చేస్తున్నామని బుఖైతీ పునరుద్ఘాటించారు. పాకిస్థాన్, టర్కీ ప్రభుత్వాలు ఈ వివాదంలో తటస్థంగా ఉండాలని, తమ సరిహద్దులకు సంబంధంలేని యుద్ధంలో తలదూర్చవద్దని ఆయన సూచించారు. ఆగస్టు 7న సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం.. మూడు దేశాల్లో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా దానిని ముగ్గురిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. ఈ ఒప్పందం కింద సౌదీ భూభాగాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. టర్కీ కూడా సౌదీకి అవసరమైన సైనిక, సాంకేతిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. సౌదీలోని ఇంధన వనరులు, ప్రధాన నగరాల సమీప ప్రాంతాలపై హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో దాడులు తీవ్రతరం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ఈ కొత్త రక్షణ ఒప్పందం కింద విదేశీ బలగాలను యెమెన్‌లో మోహరించినట్లు ఇంకా అధికారికంగా ధ్రువీకరణ కాలేదు.

## ఇరాన్ యుద్ధానికి అమెరికా ఖర్చు రూ.4.32 లక్షల కోట్లు

**o ఏడు నెలల్లో 45.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు ని కాంగ్రెస్‌కు ట్రంప్ ప్రభుత్వం వెల్లడి**
**o యుద్ధం కోసం 43.6 బిలియన్ డాలర్ల వ్యయం**
**o చమురు కోసం మరో 1.5 బిలియన్ డాలర్లు ఖర్చు**
**o ఫిబ్రవరి 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు లెక్కలు**
**o ఇప్పటి ఖర్చు అంచనా మాత్రమేనని ప్రభుత్వం స్పష్టీకరణ**
**o ధ్వంసమైన స్థావరాలు, భవనాల మరమ్మతు ఖర్చులు ఇందులో లేవు**
**o క్షిపణుల అడ్డుగోలు వ్యవస్థలకే భారీగా వ్యయం**
**o చమురు సరఫరా సమస్యలతోనూ ఆర్థిక భారం**
**o యుద్ధం కొనసాగితే ఖర్చు మరింత పెరిగే అవకాశం**



న్యూఢిల్లీ
అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేని పరిస్తితి. ఈ యుద్ధం అమెరికాకు ఆర్థిక భారంగా మిగిలింది. ఈ యుద్ధం కోసం ట్రంప్ ప్రభుత్వం చేసిన వ్యయం 45.1 బిలియన్ డాలర్లుగా తేలింది. అంటే మన కరెన్సీలో రూ.4.32 లక్షల కోట్లు అని ట్రంప్ ప్రభుత్వం యూఎస్ కాంగ్రెస్‌కు తెలిపింది. దాదాపు ఏడు నెలల నుంచి సాగుతున్న ఈ యుద్ధం కోసం అమెరికా చేసిన ఖర్చు మన దేశంలోని అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌తో సమానం.ఇందులో 43.6 బిలియన్ డాలర్లు యుద్ధం కోసం ఖర్చుకాగా, 1.5 బిలియన్ డాలర్లు చమురు కోసం అయిన ఖర్చు. అయితే, ఇది అంచనా మాత్రమే. కచ్చితమైన, పూర్తిస్తాయి వివరాలు కాదు. గత ఫిబ్రవరి 28 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 2 వరకు జరిగిన ఖర్చు మాత్రమే. ఈ వ్యయంలో మిలిటరీ స్థావరాల ధ్వంసం, అనేక బిల్డింగులు ధ్వంసం కావడం, వాటి మరమ్మతులకు సంబంధించిన ఖర్చుల్ని చేర్చలేదు. పూర్తిస్థాయి వ్యయ వివరాల్ని కూడా ప్రభుత్వం వెల్లడించలేదు. ప్రస్తుతం అంచనా వేసిన ఖర్చు.. గతంలో అంచనాలకు మించింది. ప్రస్తుతం ఈ యుద్ధం కొనసాగుతున్నందున ఖర్చు భవిష్యత్తులో ఇంకా పెరిగే అవకాశం ఉంది. అమెరికా చేసిన వ్యయంలో మిస్సైల్స్, క్షిపణుల్ని అడ్డుకునే టెక్నాలజీ కోసమే ఎక్కువ ఖర్చు అయింది. ఇదే సమయంలో యుద్ధం కారణంగా చమురు సరఫరాలో ఇబ్బందులు ఎదురవ్వడం వల్ల కూడా ఆర్థిక భారం పెరిగింది. ఈ ఖర్చులకు ద్వైపాక్షిక సంబంధాలపై జరిగిన చర్చలు వంటివి అదనం.

## రష్యాపై విరుచుకుపడిన ఉక్రెయిన్



మాస్కో
రష్యాపై ఉక్రెయిన్ మరోసారి విధ్వంసక దాడులకు దిగింది. శనివారం అర్ధరాత్రి మాస్కోలోని ప్రాంతాలు లక్ష్యంగా 1,600కుపైగా డ్రోన్లను ప్రయోగించింది. వీటిలో సుమారు 450 డ్రోన్లు మాస్కో నగరం వైపు వచ్చినట్లు మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. ఈ దాడిని మాస్కోపై ఇప్పటివరకు జరిగిన అత్యంత భారీ డ్రోన్ దాడిగా ఆయన అభివర్ణించారు. దాడుల్లో మాస్కో ఆయిల్ రిఫైనరీతో పాటు పలు పారిశ్రామిక, లాజిస్టిక్స్ కేంద్రాలు, నివాస భవనాలు దెబ్బతిన్నాయి. రిఫైనరీ పరిసరాల్లో భారీగా మంటలు చెలరేగి, ఆకాశంలోకి దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. రష్యా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ దాడుల్లో కనీసం ఇద్దరు మరణించగా, పలువురు గాయపడ్డారు. పలు డ్రోన్లు మాస్కోలోని కీలక ఆయిల్ రిఫైనరీతో సహా నాలుగు భవనాలను తాకినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలు, విద్యుత్ వ్యవస్థలు లక్ష్యంగా తాజాగా దాడులు జరిగింది. వీటి కారణంగా మాస్కోలోని విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతబడ్డాయి.
ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్స్కీ కూడా తాజాగా దాడులను ధృవీకరించారు. యుద్ధానికి ఆర్థికంగా సహకరిస్తున్న కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడి అనంతరం పారిశ్రామిక ప్రాంతాల్లో భారీగా చెలరేగిన మంటల దృశ్యాలను జెలెన్స్కీ విడుదల చేశారు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ మాత్రం రష్యా భూభాగం, ఆక్రమిత క్రిమియా, నల్లసముద్ర ప్రాంతాల్లో 1,110 ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు ప్రకటించింది.
మాస్కో ప్రాంతంలోని సోఫినోలో డ్రోన్ దాడిలో మూడు అంతస్తుల నివాస భవనం దెబ్బతినడంతో 44 ఏళ్ల మహిళ మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. మరోచోట ఓ ఇల్లు దెబ్బతినడంతో వృద్ధుడు మరణించినట్లు ప్రాంతీయ గవర్నర్ ఆండ్రే వోరోబ్యోవ్ తెలిపారు.
పార్లమెంట్ ఎన్నికల వేళ దాడులు
ఈ భారీ దాడులు రష్యాలో స్టేట్ డూమా పార్లమెంట్ ఎన్నికల చివరి రోజు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికలను అడ్డుకునేందుకే ఈ దాడి జరిగిందని మాస్కో మేయర్ ఆరోపించారు. రష్యా ఎన్నికల్లో అధికార యునైటెడ్ రష్యా పార్టీ ఆధిపత్యం కొనసాగుతుందని అంచనా. ప్రతిపక్షాలపై ఆంక్షలు, యుద్ధ వ్యతిరేక అభ్యర్థులకు అవకాశం లేకపోవడంపై విమర్శలు ఉన్నాయి. ఉక్రెయిన్ మాత్రం రష్యా ఎన్నికలను "షామ్ ఎలక్షన్" గా అభివర్ణించింది. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్ అధికారులు కీవ్, సుమీ ప్రాంతాల్లో రష్యా జరిపిన దాడుల్లో ముగ్గురు చిన్నారులు సహా తొమ్మిది మంది మరణించినట్లు తెలిపారు. దీంతో ఇరు దేశాల మధ్య డ్రోన్, క్షిపణి దాడులు మరింత తీవ్రతరమైన పరిస్థితి కనిపిస్తోంది.

# ఉత్తరప్రదేశ్‌లో 151 అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయి



**లక్నో:**
ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ పాలనలో 151 అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. అయితే కేవలం 14 కేసుల్లో మాత్రమే అరెస్టులు జరిగాయని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ప్రయత్నంలో భాగంగానే ఉద్దేశపూర్వకంగా ఈ విధ్వంసకాండ జరిగిందని ఆయన విమర్శించారు. ఆదివారం లక్నోలోని పార్టీ కార్యాలయంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని 72 జిల్లాల్లో బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహాలు 151 వరకు ధ్వంసమైనట్లు తెలిపారు. తమ పార్టీ గుర్తించిన సంఘటనలు, పోలీస్ కేసులు, ప్రభుత్వ సమాచారం ఆధారంగా ఈ లెక్క తేల్చినట్లు చెప్పారు. 'బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహాలే అత్యధికంగా ధ్వంసమయ్యాయి. బీజేపీ ప్రభుత్వ హయాంలో 72 జిల్లాల్లో 151కు పైగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసం చేయడం లేదా పాడుచేయడం జరిగాయి' అని ఆయన అన్నారు.కాగా, బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాల ధ్వంసానికి సంబంధించిన విధ్వంసకాండ ఉద్దేశపూర్వకంగా జరిగిందని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ప్రయత్నంతో దీనిని ముడిపెట్టారు. 'రాజ్యాంగాన్ని మార్చాలని వారు (బీజేపీ) భావించినప్పటికీ అందులో విఫలమయ్యారు. అందుకే ఈ చర్య ఉద్దేశపూర్వకంగా జరిగింది. బీజేపీ, ఆ భావజాలం కలిగిన వారు దాడి చేసినప్పుడు, వారు మొదటగా లక్ష్యంగా చేసుకునేది చేతిలో ఉండే రాజ్యాంగ ప్రతిని' అని విమర్శించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాల ధ్వంసానికి సంబంధించిన కేసుల వివరాలను సమాజ్‌వాదీ పార్టీ స్వయంగా సేకరించిందని అఖిలేష్ యాదవ్ తెలిపారు. 'మొత్తంగా మేం 151 కేసులను నమోదు చేయగలిగాం. సగటున లెక్కించి చూస్తే, బీజేపీ ప్రభుత్వ హయాంలో ఏటా 15కు పైగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయి. నమోదు కాని లేదా లెక్కలోకి రాని కేసులు కూడా ఉండవచ్చు' అని అన్నారు. అయితే ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ కేవలం 14 కేసుల్లోనే అరెస్టులు జరిగాయని అఖిలేష్ యాదవ్ తెలిపారు. 45 కేసుల్లో గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఎనిమిది కేసుల్లో నిర్దిష్ట వ్యక్తుల పేర్లతో ఎఫ్ఐఆర్‌లు దాఖలైనట్లు చెప్పారు. 84 కేసుల్లో ఎటువంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను గానీ, ఆయన విగ్రహాలను గానీ, లేదా ఆయన అనుచరులను గానీ గౌరవించలేదని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. ఆ తర్వాత జిల్లాల వారీగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమైన గణాంకాలను ఆ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

## 17 ఏండ్లలో లేనంతగా కరువు

ఎల్ నినోతో 15 శాతం లోటు వర్షపాతం నమోదు
తెలంగాణలో 22%, ఏపీలో 45% తక్కువగా రికార్డు
నైరుతి తిరోగమనం ప్రారంభం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20
నైరుతి రుతుపవనాల తిరోగమనంప్రారంభమైంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో 15 శాతం తక్కువ వర్షపాతంనమోదు కాగా, ఎల్ నినో కూడా ఏర్పడటంతో తీవ్ర వర్షాభావ, కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా దక్షిణ ద్వీపకల్పం తీవ్రంగా ప్రభావితమై 28 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. గత 17 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా అత్యంత కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో దేశంలోని పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది.
సాగునీటికే కాక, తాగు నీటికి కూడా ఇబ్బందులు ఏర్పడ్డాయి. 17 ఏండ్లలో అత్యంత తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలోనే శనివారం నైరుతి రుతుపవనాలు పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి తిరోగమించడం ప్రారంభమైంది. రాబోయే కొద్ది వారాల్లో నాలుగు నెలల పాటు సాగే వర్షాకాలం ముగింపునకు నాంది పలకబోతున్నది. రాజస్థాన్‌లోని మరికొన్ని ప్రాంతాలు, పంజాబ్, గుజరాత్‌లలోని కొన్ని ప్రాంతాల నుంచి తిరోగమనానికి రానున్న 3,4 రోజులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.
దక్షిణ రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం
బలమైన ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ సీజన్ మొత్తంలో దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇక దక్షిణాది రాష్ట్రాలను చూస్తే అత్యధికంగా ఏపీలో 43 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. తర్వాతి స్థానాల్లో కర్ణాటక (31 శాతం), కేరళ (28 శాతం), తమిళనాడు (22 శాతం), తెలంగాణ (22 శాతం) ఉన్నాయి. ఇక ఇతర రాష్ట్రాల్లో పంజాబ్‌లో అత్యధికంగా 39 శాతం లోటు వర్షపాతం నమోదైంది. బీహార్ (36 శాతం), హర్యానా (22 శాతం),

## పాక్ సైన్యంలో భారీ మార్పులు



న్యూఢిల్లీ
పాకిస్తాన్ సైన్యంతోపాటు ఐఎస్ఐలో కీలక మార్పులు జరిగాయి. అనేక విభాగాలకు చెందిన ఉన్నతాధికారుల్ని మార్చేశారు. డీజీ-ఎస్ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ ద స్పెషల్ ఆపరేషన్స్ డైరెక్టరేట్)గా మేజర్ జనరల్ ముహమ్మద్ షమైజ్ ఖాన్‌ను ఆర్మీ నియమించింది. ఇది ఐఎస్ఐలో కీలక విభాగం. ప్రధానంగా ఇండియాకు వ్యతిరేకంగా పాక్ సైనిక కార్యకలాపాల్ని, ఉగ్ర కార్యకలాపల్ని కూడా పర్యవేక్షిస్తుంటుంది.రెండు రోజుల క్రితం.. అంటే గత శుక్రవారమే సైన్యంలో ఇలా అనేక మార్పులు జరిగినట్లు భారత నిఘా విభాగం గుర్తించింది. మరోవైపు మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న మేజర్ జనరల్ వాజిద్ అజీజ్‌ను తొలగించినట్లు తెలుస్తోంది. అతడి స్థానంలో మేజర్ జనరల్ అదిల్ వారియాచ్‌ను నియమించారు. అలాగే, ఐఎస్ఐ కౌంటర్ టెర్రరిజం డైరెక్టరేట్‌గా ఉన్న మేజర్ జనరల్ ఖుర్రం షబ్బీర్‌ను కూడా తొలగించారు. అతడిని జీఓసీ 17 డివిజన్, ఖైరాన్‌కు బదిలీ చేశారు. మేజర్ జనరల్ సాజిద్ అమిన్ అవాన్‌ను డీజీ-జడ్‌కు అధిపతిగా నియమించారు. ఇటీవల పాక్ ఆర్మీలో అంతర్గత బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఉన్నత విభాగాల అధికారులను మరో స్థానంలోకి మారుస్తున్నారు. అన్నింటిలోకి కీలకమైంది ఐఎస్ఐ డీజీఎస్‌గా మేజర్ జనరల్ ముహమ్మద్ షమైజ్ ఖాన్‌ను నియమించడం. ఐఎస్ఐ అంటే, పాక్ ఇంటెలిజెన్స్ విభాగం. అయితే, ప్రస్తుతం నియామకమైన ముహమ్మద్ షమైజ్ ఖాన్‌కు ఎలాంటి ఇంటెలిజెన్స్ అనుభవం లేదు. అయితే, ఇండియా సరిహద్దులో కార్యకలాపాల నిర్వహణలో మాత్రం అతడికి అనుభవం ఉంది.

## దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

మొదటి తరువాయి

ప్రభుత్వం లక్ష్యమని పునరుద్ఘాటించారు. పేదలు, దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నో చారిత్రాత్మక మైన నిర్ణయాలను తీసుకుందని గుర్తు చేశారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములిచ్చి ఆ భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ, సుమారు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు.
భూమిలేని పేదలకు హక్కులు కల్పించాం
భూమిలేని పేదలకు భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తామంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. 'దళితులకు సంబంధించిన ఒక అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది' మంత్రి భరోసా ఇచ్చారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని స్పష్టం చేశారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు.భూముల రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూపించామని వివరించారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళితుల భూముల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ... విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

మొదటి తరువాయి

గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి. వీటితో పాటు చర్లపల్లి – నాగర్కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్లో సొంతూర్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## విదేశాంగ శాఖ మంత్రికి 'సర్' నోటీసు..!



న్యూఢిల్లీ
కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా.. సామాన్యుల నుంచి రాజకీయ ప్రముఖులు, కేంద్ర మంత్రులు కూడా నోటీసులు ఎదుర్కొంటున్నారు. తాజాగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్ కూడా నోటీసులు అందుకున్నారు. ఢిల్లీలో సర్ ప్రక్రియలో భాగంగా ఆదివారం జై శంకర్ ఆయన సతీమణి క్యోకో జై శంకర్‌కు ఈ లేఖలు అందాయి. వీరితో పాటు సీబీఐ డైరెక్టర్, మాజీ ఆర్మీ అధికారులు సర్ నోటీసులు అందుకున్నారు.ఓటరు జాబితాలో సవరణలో భాగంగా దేశవ్యాప్తంగా పలువురు సర్ నోటీసులు అందుకుంటున్నారు. ఢిల్లీలో ఆదివారం కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కూడా నోటీసు వచ్చాయి. 2002 ఢిల్లీ ఓటరు జాబితాలో జై శంకర్, ఆయన భార్య పేరు లేవు. దాంతో, ఓటరు జాబితాలో అవసరమైన మార్పుల కోసం సరైన ధ్రువ పత్రాలు సమర్పించాలని వీరికి ఎన్నికల సంఘం నోటీసులు ఇచ్చింది. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆయన కుటుంబ సభ్యులకు బీఎల్‌వోలు సర్ నోటీసు ఇచ్చారు.తాజాగా సర్ నోటీసు అందుకున్న వారిలో ఆర్మీ మాజీ అధికారి ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య.. సుప్రీం కోర్టు మాజీ న్యాయవాది రంజన దేశాయ్, ఆయన కుటుంబ సభ్యులు ఉన్నారు. 'విదేశాంగ మంత్రి సహా పలువురు అధికారులు, మాజీ న్యాయవాది, వారి కుటుంబ సభ్యుకు సిస్టమ్ ఆధారిత నోటీసులు అందించాం. ఈసీఐఎన్ఈటీలో వీరు తమ వివరాలను సరి చేసుకోవాలని కోరాం' అని ఢిల్లీ ఎన్నికల అధికారి వెల్లడించారు

## తెలంగాణకు భారీ వర్ష సూచన

మొదటి తరువాయి

ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే, ఆది, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.
ఉదయం ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం, పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతోంది. ఇది సోమవారం (సెప్టెంబర్ 21) నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. బుధవారం ఉదయానికి ఈ వాయుగుండం ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలోకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 24న తెలంగాణలోని మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రత్యేకంగా హెచ్చరించింది. అలాగే ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా మరికొన్ని జిల్లాల్లో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఇదిలా ఉండగా, దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24 గంటల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అత్యధికంగా 13.9 సెం.మీ., ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తాజా హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఇటలీ పాఠశాలల్లో బుర్ఖా, నిఖాబ్‌పై నిషేధం

**విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి**

రోమ్:
ఇటలీలోని పాఠశాలల్లో ముఖాన్ని పూర్తిగా కప్పి ఉంచే బుర్ఖా, నిఖాబ్‌లను నిషేధించడంతోపాటు, ఒక్కో తరగతిలో విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి విధించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని జార్జియా మెలోని ఆదివారం ప్రకటించారు. విద్యా వ్యవస్థలో ఇటాలియన్ భాషా పరిజ్ఞానం, వలస విధానాలకు సంబంధించిన చర్యలను క్యాబినెట్ ముందుకు తీసుకురానున్నట్లు ఆమె తెలిపారు. మెలోని తన 'బ్రదర్స్ ఆఫ్ ఇటలీ' పార్టీ యువజన విభాగం వార్షిక సమావేశంలో ఈ ప్రతిపాదన వెల్లడించారు. ప్రతి తరగతి గదిలో విదేశీ విద్యార్థుల సంఖ్య గరిష్ఠ పరిమితిని చట్టబద్ధం చేసే చర్యను త్వరలోనే క్యాబినెట్ ముందుకు తీసుకువస్తామని తెలిపారు.

# రెడ్లు,వెలమల ఆధిపత్యానికి చరమగీతం పాడాలి

**-బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. బీసీలకే అన్యాయం చేస్తారా?**

**-షాద్‌నగర్ లో తీన్మార్ మల్లన్న పాదయాత్ర.. రోడ్డు షోలో ప్రసంగం**

**- రెడ్లు బోనాలు చేయరనీ వ్యాఖ్యలు**



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబరు 20 నవ సంఘర్షణ** తెలంగాణలో రాజకీయ అధికారం కొద్దిమంది ఆధిపత్య వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమైందని, ఇకపై బీసీలు తమ జనాభా ప్రాతిపదికన రాజకీయ వాటా కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. గోల్కొండ కోట నుంచి ప్రారంభించిన బీసీ రాజ్యాధికార పాదయాత్ర ఆదివారం షాద్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్డు షో సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో బీసీల సంఖ్య గణనీయంగా ఉన్నప్పటికీ, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం, రాజకీయ నిర్ణయాధికారం అందుకు అనుగుణంగా లేదని మల్లన్న విమర్శించారు. ఒకవైపు పెద్ద సంఖ్యలో ఉన్న బీసీలు, మరోవైపు తక్కువ సంఖ్యలో ఉన్న అగ్రవర్ణ వర్గాల మధ్య రాజకీయ అధికార పంపిణీలో తీవ్ర అసమానత ఉందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రెడ్లు, వెలమల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలికి బీసీలకు రాజ్యాధికారం సాధించడమే తమ లక్ష్యమని మల్లన్న స్పష్టం చేశారు. బీసీల ఓట్లతో అధికారాన్ని సాధించి, తిరిగి అదే బీసీలకు రాజకీయ అవకాశాలు దక్కకుండా చేసే పరిస్థితులను ఇక సహించబోమని అన్నారు.

"మాకు రెడ్లు, వెలమల ఓట్లు అవసరం లేదు. అదే విధంగా మీకు బీసీల ఓట్లు అవసరం లేకపోతే.. బీసీల ఓట్లు లేకుండా మీరు చట్టసభల్లోకి ఎలా వెళ్తారు?" అంటూ మల్లన్న ప్రశ్నించారు. రాజకీయంగా బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకునే పరిస్థితిని మార్చాలని ఆయన పిలుపునిచ్చారు.

రెడ్ల మహిళలు ఏనాడు బోనాలు ఎత్తలేదని, పోచమ్మ మైసమ్మలను కొలవరనీ అలాంటప్పుడు రెడ్లు మా వాళ్ళు ఎలా అవుతారని తీన్మార్ మల్లన్న విమర్శించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి ప్రధాన రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా బీసీల రాజకీయ శక్తిని సమీకరించేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతుందని మల్లన్న తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీసీల రాజకీయ ప్రయోజనాల కోసం తమ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. గోల్కొండ నుంచి ప్రారంభించిన ఈ యాత్ర లక్ష్యం బీసీల రాజకీయ సాధికారతేనని ఆయన గతంలోనూ ప్రకటించారు. ఇక పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి షాద్‌నగర్ పరిసర ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మల్లన్న డిమాండ్ చేశారు. ఈ ప్రాంత రైతులు, ప్రజల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ శివారులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో కాలుష్యకారక పరిశ్రమల ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు స్థానికులకు తగిన ఉపాధి అవకాశాలు లభించకపోవడం బాధాకరమని అన్నారు.

స్థానిక భూములు, వనరులు, అవకాశాలు స్థానిక ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడేలా విధానాలు రూపొందించాలని మల్లన్న కోరారు. బీసీలకు రాజకీయంగా మాత్రమే కాకుండా విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లోనూ సముచిత వాటా దక్కే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీసీలు తమ ఓటు విలువను గుర్తించి రాజకీయ అధికారంలో భాగస్వాములు కావాలని, కేవలం ఎన్నికల సమయంలో ఓటు వేసే వర్గంగా మిగిలిపోకుండా నిర్ణయాధికారాన్ని సాధించాలనే లక్ష్యంతో బీసీ రాజ్యాధికార యాత్ర కొనసాగుతుందని మల్లన్న పేర్కొన్నారు. 2028 లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు ఐకమత్యంగా ఒకే వేదిక పైకి వచ్చి రాజ్యాధికారం సాధించుకోవాలని బీసీలే ముఖ్యమంత్రి సీటులో కూర్చోవాలని మల్లన్న పిలుపునిచ్చారు. స్తానిక శాసన సభ్యులు శంకర్ పరిస్థితి బాగాలేదని చూసుకోవాలని హితవు పలికారు. అలానే చౌరస్తాలో బిఆర్ఎస్ నేత రవి యాదవ్ జన్మ దిన సందర్భంగా వేసిన ఫ్లెక్సీలను చూసి కేసీఆర్ , కేటీఆర్ ఫొటోలు వేసుకుని షాద్ నగర్లో ఉన్న వెలమల 53 ఓట్లు తో గెలుస్తారా అంటూ కామెంట్ చేశారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో జరిగింది.

# యావజిగూడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.



**సెప్టెంబరు 20 నవ సంఘర్షణ పరిగి,**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జారీ చేసిన సరికొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పరిగి మండల పరిధిలోని యావజిగూడ గ్రామంలో ఘనంగా జరిగింది. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వెంకట్ రాములు,ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. గ్రామ సర్పంచ్, యాదమ్మ నర్సింలు, మాజీ సర్పంచ్ శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కావలి సత్యనారాయణ పాల్గొని లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రారెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకుడు రమేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న పాదయాత్రలో సంఘీభావం తెలిపిన జాతీయ బీసీ సేన



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
బీసీల హక్కుల కోసం బీసీల రాజ్యం అధికారం కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న పాదయాత్రలో భాగంగా ఈరోజు షాద్నగర్ టౌన్ లో ఆగమనం కాదా జాతీయ బీసీ సేన తరపున మల్లన్నకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా ఆహ్వానం పలకడం జరిగింది తదుపరి ఉద్యమకారుల విగ్రహాలకు పూలమాలను వేసి తన పాదయాత్రలో తమవంతుగా పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జాతీయ బీసీ సేన రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ షాద్నగర్ నియోజకవర్గం ఇన్చార్జి జూఘ్ఘు జయ శ్రీకాంత్, చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షులు పోలేపల్లి శ్రీనివాస్ గౌడ్, షాద్నగర్ టౌన్ అధ్యక్షురాలు కే సరస్వతి టౌన్ ఉపాధ్యక్షురాలు పద్మ బీసీ నాయకులు రవికుమార్ గౌడ్ నక్క మల్లేష్ మేకల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు సకాలంలో కురవాలి

**-పాడిపంటలు సమృద్ధిగా పండాలి**

**-ప్రజలు రైతులు సుఖసంతోషాలతో జీవించాలి**

**-జంగోనిగూడ పృథ్వి కాలనీలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. నందిగామ మండలం అంతిరెడ్డి గూడ గ్రామపంచాయతీ జంగోనిగూడ పృద్వి కాలనీలో వినాయక మండపం వద్ద షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. వర్షాలు పడక రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని భగవంతుని ఆశీస్సులతో వర్షాలు కురిసి పంటలు పండి రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో జీవించే విధంగా భగవంతుడు ఆశీస్సులు ఇవ్వాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు జిల్లెల వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, అంతిరెడ్డిగూడ సర్పంచ్ గడ్డల మంజుల యాదగిరి, మాజీ సర్పంచ్ గోవింద్ అశోక్, ఉపసర్పంచ్ జంగ మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ మెక్కొండ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు బిజుర్ల శోభ ఆంజనేయులు, జంగ శ్రీనివాస్, నాయకులు తుమ్మల జగన్, పృథ్వి కాలనీవాసులు పాల్గొన్నారు.

# వరంగల్ విమానాశ్రయానికి 'సమ్మక్క-సారలమ్మ' పేరు పెట్టాలి: డీఎస్పీ డిమాండ్



**వికారాబాద్ సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
వరంగల్ విమానాశ్రయానికి ఆదివాసీ వీరనారీమణులు 'సమ్మక్క-సారలమ్మ'ల పేరు పెట్టాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) వికారాబాద్ జిల్లా కన్వీనర్ రవీందర్ మహారాజ్ డిమాండ్ చేశారు. డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేసిన ప్రతిపాదనను ఆయన బలపరిచారు. తెలంగాణలో 90 శాతంగా ఉన్న బహుజనుల ఆరాధ్య దైవాల పేరు పెట్టడమే సముచితమని, కాకతీయ లేదా రుద్రమదేవి పేర్లు అగ్రకులాలను మాత్రమే గుర్తుచేస్తాయని పేర్కొన్నారు. సమ్మక్క-సారలమ్మల పేరు పెట్టకపోతే ప్రభుత్వం అణగారిన వర్గాలకు వ్యతిరేకమని భావించాల్సి వస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# మట్టి వినాయకుల ను పూజిద్దాం.... పర్యావరణం ను పరిరక్షిద్దాం-ఆరెకపూడి గాంధీ.



**రంగారెడ్డి సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్, ఇజ్జత్ నగర్, చంద్రనాయక్ తండా, ధోభీ ఘాట్, జూబ్లీ గార్డెన్, హనుమాన్ నగర్, వసంత సిటీ, అరబిందో కోహినూర్ అపార్ట్మెంట్స్, సంకల్ప్ అపార్ట్మెంట్స్, క్రిష్ణ కాలనీలలో వినాయక చవితి పర్వదినంను పురస్కరించుకుని వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలందరికీ వినాయక చవితి పర్వదినం శు భాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, మీ జీవితంలోని సకల విఘ్నాలను తొలగించి, విజయాలను అందించాలని, సమస్త శుభాలు, సంతోషాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి అనుగ్రహం మీపై ,మీ కుటుంబ సభ్యుల పై ఎల్లప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటూ శ్రీ వినాయకుని ఆశీస్సులతోఅందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ వినాయక చవితి పర్వదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూనే..

పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉన్నతమైన లక్ష్యంతో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మట్టి వినాయకులను పూజించాలని, భక్తితో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను కలిగి ఉండడం మనందరి ధర్మం. ఈ వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించి, పర్యావరణహితమైన పండుగను జరుపుకోవాలని తెలియచేశారు.

వినాయక పండుగ సందర్భంగా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగినది అని, ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరుపుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వినాయక మండపాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రశాంతమైన వాతావరణం లో పండుగ నిర్వహించుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వినాయక మండపాల నిర్వాహకులకు తెలియచేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఓక్కరి సామాజిక భాద్యత అని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మట్టి వినాయకులను పూజించాలని, పాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన విగ్రహాల వలన చెరువులు కలుషితం అవుతాయి అని, చెరువులను కలుషితం కాకుండా చూడాలని, చెరువులను సంరక్షించుకోవాలని , చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,, భక్తులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లా తొలి 'ఎస్పీ'గా పంకజ్ కుమార్ మీనా

**-ప్రస్తుతం పోలవరం ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్న పంకజ్ కుమార్ మీనా**



**మార్కాపురం,సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
మార్కాపురం జిల్లా నూతన ఎస్పీగా పంకజ్ కుమార్ మీనా, ఐపీఎస్ (ఆర్ఆర్: 2020) నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో ఆర్టీ నం.1829, తేదీ 20-09-2026 ద్వారా ఐపీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులకు ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రస్తుతం పోలవరం ఓఎస్డీగా విధులు**

ప్రస్తుతం పోలవరం ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్న పంకజ్ కుమార్ మీనాను బదిలీ చేసి, మార్కాపురం జిల్లా ఎస్పీగా ఖాళీ పోస్టులో నియమించారు. ఈ పోస్టింగ్ తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.పంకజ్ కుమార్ మీనా 2020 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. కేంద్ర ప్రభుత్వ ఐపీఎస్ రికార్డుల ప్రకారం ఆయన 2020లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు.

మార్కాపురం జిల్లా ఏర్పడిన అనంతరం జిల్లా పోలీసు యంత్రాంగానికి కొత్త ఎస్పీగా పంకజ్ కుమార్ మీనా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన నియామకంతో జిల్లా పోలీసు పరిపాలనలో కీలక మార్పు చోటు చేసుకుంది.

## తేజస్ యుద్ధ విమానంలో ప్రయాణించిన జపాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్..!



**న్యూఢిల్లీ సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
భారత్ కు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్ లో జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ టకెహిరో మొరిటా ప్రయాణించారు. ఆయనతోపాటు భారత వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ కూడా తేజస్‌లో ప్రయాణించారు. ఆదివారం ఉదయం భారత్-జపాన్ ద్వైపాక్షిక వాయుసేన సంయుక్త విన్యాసాలు వీర్ గార్డియన్-2026లో భాగంగా జోధ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి వీటిని నిర్వహించారు.తొలుత వాయుసేన స్థావరానికి వచ్చిన వీరు తమకు కేటాయించిన తేజస్ విమానాల వద్దకు చేరుకొన్నారు. భారత పైలట్‌తో కలిసి జపాన్ వాయుసేన అధిపతి విమానం నడపగా.. ఐఏఎఫ్ చీఫ్ స్వయంగా మరో తేజస్ విమానాన్ని నడిపారు. ఈ విన్యాసాల్లో భారత్-జపాన్ యుద్ధ వ్యూహాలను కూడా పంచుకొన్నాయి. ఈ విన్యాసాల్లో భారత్ సుఖోయ్-30 ఎంకేఐ, రఫేల్ ఫైటర్‌జెట్, ఎల్‌సీఏ తేజస్ విమానాలు భారత్ నుంచి పాల్గొనగా.. జేఏఎస్‌డీఎఫ్ నుంచి ఎఫ్-2ఏ ఫైటర్ జెట్ పాల్గొన్నది.

## ముఖాన్ని అద్దెకిచ్చి రూ. లక్షలు సంపాదిస్తున్నరు!

**చైనాలో ఏఐ కంటెంట్ కోసం కిరాయికి ఇస్తున్న ప్రజలు**

**ప్రకటనలు, సీరియల్స్, గేమ్స్‌ల్లో వినియోగిస్తున్న సంస్థలు**



**చైనా: సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
చైనాలో ప్రజలు తమ ముఖాలను ఏఐ కంటెంట్ కోసం అద్దెకిచ్చి డబ్బు సంపాదిస్తున్నారు. వారి ముఖాలను టీవీ సీరియల్స్, ప్రకటనలు, గేమ్స్ తదితరాల్లో ఉపయోగిస్తున్నారు. కొన్ని ప్లాట్‌ఫామ్‌లు ఒక వ్యక్తి ముఖాన్ని ఉపయోగించినందుకు రూ. 14 లక్షల వరకు చెల్లిస్తున్నాయి. ఒక ప్రకటన సంస్థ ఓ బ్యాంకు ఉద్యోగి ముఖాన్ని మూడు రోజుల్లో ఏడుసార్లు ఉపయోగించింది. అందుకు ప్రతిఫలంగా అతనికి సుమారు రూ. 36,000 చెల్లించింది.
ఒక వ్యక్తి తన ముఖాన్ని రొమాన్స్, కుటుంబ కథనాలకు సంబంధించిన కంటెంట్‌లో ఉపయోగించేందుకు రూ. 1,400 వసూలు చేస్తున్నాడు. ఓ చైనా ప్లాట్‌ఫామ్‌లో 370 మంది డిజిటల్ నటుల ప్రొఫైల్స్ ఉన్నాయి. సినిమాలు, మోడలింగ్, యానిమేషన్ గేమ్స్ కోసం వారి ముఖాలను ఎంపిక చేస్తున్నారు. తమ ముఖాన్ని భయానక లేదా లైంగిక కంటెంట్‌లో ఉపయోగించేందుకు వారు నిరాకరించవచ్చు. కంటెంట్‌లో ముఖాన్ని ఉపయోగించేందుకు ఇచ్చే అనుమతి, ఆ ముఖాన్ని ఏఐ శిక్షణ కోసం ఉపయోగించేందుకు ఇచ్చే అనుమతి ఒకటి కాదు. కొన్ని ఒప్పందాల్లో అంగీకరించిన కాలం పూర్తికాకముందే లైసెన్స్‌ను ఉపసంహరించుకుంటే సుమారు రూ. 7.2 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనలు కూడా ఉన్నాయి.

## సెల్ఫ్ ఫ్లయింగ్ విమానం వచ్చేస్తోంది!



**వాషింగ్టన్ సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల తర్వాత త్వరలో సెల్ఫ్ ఫ్లయింగ్ విమానాలు అందుబాటులోకి రాబోతున్నాయి. అమెరికాలో తొలిసారిగా పైలట్ లేకుండా పూర్తిగా స్వయంగా దానికదే నడిచే వ్యవస్థ కలిగిన విమానం 3,199 మైళ్ల దూరాన్ని చుట్టేసింది. ఏరోస్పేస్ సంస్థ జాబీ ఏవియేషన్ నిర్వహించిన సింగిల్- ఇంజిన్ సెస్నా కారవాన్ విమానం రన్‌వేపై ట్యాక్సీయింగ్ నుంచి టేకాఫ్, ల్యాండింగ్, వరకూ అన్ని దశలను దానికదే పూర్తి చేసింది. ఈ విమానం సెప్టెంబర్ 7న కాలిఫోర్నియాలోని కాంకర్డ్‌లో ఉన్న జాబీ స్థావరం నుంచి బయలుదేరింది.ఒకే దశలో నాన్‌స్టాప్‌గా కాకుండా పలు ప్రాంతాల మీదుగా అనేక దశల్లో ప్రయాణించింది. ఈ ప్రయాణంలో పీనిక్స్ డీర్ వ్యాలీ వంటి అత్యంత రద్దీగా ఉండే జనరల్ ఏవియేషన్ విమానాశ్రయాల్లోనూ విమానం దానికదే మార్గాన్ని అనుసరించింది. తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, ఉరుములతో కూడిన వర్షాలు ఎదురైన సమయంలోనూ విమానం రియల్ టైమ్‌లో మార్గాన్ని మార్చుకుంది.

## హెచ్‌ఐవీ చికిత్సలో గోలీల కన్నా ఇంజెక్షన్లే బెటర్!



**లండన్ సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
హెచ్‌ఐవీతో జీవిస్తున్న యువతలో రోజూ గోలీలు వేసుకోవడం కంటే ప్రతి ఎనిమిది వారాలకు ఒకసారి ఇచ్చే యాంటీరెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) ఇంజెక్షన్లు మెరుగైన ఫలితాలను ఇస్తున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ పరిశోధన వివరాలు ది లాన్సెట్ వైద్య జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. యూనివర్సిటీ కాలేజ్ లండన్(యూసీఎల్) పరిశోధకులు ఆఫ్రికాలో నిర్వహించిన క్లినికల్ ట్రయల్‌లో ఈ విషయాన్ని గుర్తించారు. రోజూ తీసుకునే మాత్రలతో పోలిస్తే ఇంజెక్షన్ల ద్వారా హెచ్‌ఐవీ వైరస్‌ను అణచివేయడం సమర్థవంతంగా ఉన్నట్లు తేలింది.

# ఉత్తరప్రదేశ్‌లో 151 అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయి



**లక్నో: సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ పాలనలో 151 అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. అయితే కేవలం 14 కేసుల్లో మాత్రమే అరెస్టులు జరిగాయని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ప్రయత్నంలో భాగంగానే ఉద్దేశపూర్వకంగా ఈ విధ్వంసకాండ జరిగిందని ఆయన విమర్శించారు. ఆదివారం లక్నోలోని పార్టీ కార్యాలయంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని 72 జిల్లాల్లో బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహాలు 151 వరకు ధ్వంసమైనట్లు తెలిపారు. తమ పార్టీ గుర్తించిన సంఘటనలు, పోలీస్ కేసులు, ప్రభుత్వ సమాచారం ఆధారంగా ఈ లెక్క తేల్చినట్లు చెప్పారు.
'బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహాలే అత్యధికంగా ధ్వంసమయ్యాయి. బీజేపీ ప్రభుత్వ హయాంలో 72 జిల్లాల్లో 151కు పైగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసం చేయడం లేదా పాడుచేయడం జరిగాయి' అని ఆయన అన్నారు.కాగా, బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాల ధ్వంసానికి సంబంధించిన విధ్వంసకాండ ఉద్దేశపూర్వకంగా జరిగిందని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ప్రయత్నంతో దీనిని ముడిపెట్టారు. 'రాజ్యాంగాన్ని మార్చాలని వారు (బీజేపీ) భావించినప్పటికీ అందులో విఫలమయ్యారు. అందుకే ఈ చర్య ఉద్దేశపూర్వకంగా జరిగింది. బీజేపీ, ఆ భావజాలం కలిగిన వారు దాడి చేసినప్పుడు, వారు మొదటగా లక్ష్యంగా చేసుకునేది చేతిలో ఉండే రాజ్యాంగ ప్రతిని' అని విమర్శించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాల ధ్వంసానికి సంబంధించిన కేసుల వివరాలను సమాజ్‌వాదీ పార్టీ స్వయంగా సేకరించిందని అఖిలేష్ యాదవ్ తెలిపారు. 'మొత్తంగా మేం 151 కేసులను నమోదు చేయగలిగాం. సగటున లెక్కించి చూస్తే, బీజేపీ ప్రభుత్వ హయాంలో ఏటా 15కు పైగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయి. నమోదు కాని లేదా లెక్కలోకి రాని కేసులు కూడా ఉండవచ్చు' అని అన్నారు. అయితే ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ కేవలం 14 కేసుల్లోనే అరెస్టులు జరిగాయని అఖిలేష్ యాదవ్ తెలిపారు. 45 కేసుల్లో గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఎనిమిది కేసుల్లో నిర్దిష్ట వ్యక్తుల పేర్లతో ఎఫ్ఐఆర్‌లు దాఖలైనట్లు చెప్పారు. 84 కేసుల్లో ఎటువంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను గానీ, ఆయన విగ్రహాలను గానీ, లేదా ఆయన అనుచరులను గానీ గౌరవించలేదని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. ఆ తర్వాత జిల్లాల వారీగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమైన గణాంకాలను ఆ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

# మళ్లీ దాడులకు అమెరికా సిద్ధం?

**ఇరాన్ సెంట్రల్ మిలిటరీ కమాండ్ ఆరోపణ**



**టెహ్రాన్ సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
ఇరాన్‌పై అమెరికా మరోసారి సైనిక చర్యలకు సిద్ధమవుతోందని తమకు సమాచారం అందిందని ఇరాన్ సెంట్రల్ మిలిటరీ కమాండ్ ఆదివారం వెల్లడించింది. కొన్ని ప్రాంతీయ దేశాల మద్దతుతో అమెరికా ఈ చర్యలకు సన్నాహాలు చేస్తోందని ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అమెరికా దాడులకు దిగితే ప్రాంతీయంగా ఉన్న అమెరికా స్థావరాలపై నిరంతరం దాడులు కొనసాగుతాయని ఇరాన్ సైనిక కమాండ్ హెచ్చరించింది.ఇరాన్‌లోని ఖాతమ్ అల్ అన్బియా ప్రధాన కార్యాలయం తన ప్రకటనలో అమెరికాతో కలిసి వ్యవహరించే పశ్చిమాసియా దేశాలకూ హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా స్థావరాల నుంచి ఇరాన్‌పై పెద్ద ఎత్తున దాడులు పునఃప్రారంభమైతే, వాటికి సహకరించే ప్రాంతీయ దేశాలను కూడా ఘర్షణలో భాగస్వాములుగా పరిగణిస్తామని తెలిపింది. ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలోని పలు దేశాల్లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయాలు ఆదివారం ఉదయం తమ పౌరులకు భద్రతా హెచ్చరికలు జారీ చేశాయి. అనూహ్య పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపాయి.
అమెరికాకు 7 షరతులు యుద్ధం ముగించేందుకు అమెరికాతో చర్చలు జరపడానికి సిద్ధమని ఇరాన్ వెల్లడించింది. అయితే చర్చల్లో పాల్గొనాలంటే ఏడు షరతులకు అమెరికా ఒప్పుకోవాలని తెలిపింది. ఈ మేరకు తమ షరతులను అమెరికాకు ఖతార్ చేరవేసిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మెహ్సెన్ రెజాయీ చెప్పారు. ఈ చర్చలపై అమెరికా అధ్యక్షుడి స్పందన కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. ఒకవేళ అమెరికా తమ డిమాండ్లను తిరస్కరిస్తే మరింత దూకుడుగా నిర్ణయాత్మక యుద్ధానికి దిగుతామని వార్నింగ్ ఇచ్చారు.

**అమెరికా ముందు కీలక షరతులు..**
చర్చల్లో పాల్గొనాలంటే అన్ని విధాలుగా అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించడం, విదేశాల్లో నిలిపివేసిన నిధులను విడుదల చేయడం ఇందులో కీలకంగా ఉన్నాయి. అలాగే అమెరికా సైనిక చర్యలను నిలిపివేయడం, ప్రాంతీయ స్థాయిలో కాల్పుల విరమణకు హామీలు, ఇరాన్‌పై ఉన్న ఆంక్షలు ఎత్తేసి ఆర్థిక ఒత్తిడికి పరిష్కారం చూపడం, భవిష్యత్ చర్చలకు సంబంధించిన భద్రతా, రాజకీయ హామీలు ఇందులో ఉన్నట్టు తెలుస్తున్నది. అలాగే అమెరికా తమ నౌకా దిగ్బంధనాన్ని ఎత్తేయాలనే ప్రధాన డిమాండ్ ఇందులో ఉన్నట్టు తెలుస్తున్నది.

## 8 గంటలు ఆలస్యమైన రైలు..

**ప్రయాణికునికి 35 వేలు పరిహారం**

**రైల్వేకు జార్ఖండ్ వినియోగదారుల కమిషన్ ఆదేశం**



**రాంచీ: సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
రైలు 8 గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికునికి శారీరక, మానసిక, ఆర్థిక ఇబ్బందులు కలిగాయని పేర్కొంటూ, రూ.35 వేల పరిహారం చెల్లించాలని దక్షిణ తూర్పు రైల్వేను జార్ఖండ్‌లోని వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. ఇందులో రూ. 30 వేల పరిహారం, రూ. 5 వేల న్యాయపరమైన ఖర్చులు ఉన్నాయి. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రకారం సెరైకెల్లా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఈ మేరకు తీర్పునిచ్చింది.2024 సెప్టెంబర్‌లో టాటానగర్ నుంచి సంబల్‌పూర్ వెళ్లేందుకు ప్రయాణికుడు ఇస్పాత్ ఎక్స్‌ప్రెస్‌లో రెండు స్లీపర్ క్లాస్ టికెట్లు బుక్ చేసుకున్నారు. ఈ రైలు టాటానగర్ నుంచి ఉదయం 10:18 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 3:50 గంటలకు సంబల్‌పూర్ చేరుకోవాల్సి ఉంది. అయితే రైలు నిర్ణీత సమయానికన్నా 8 గంటల 48 నిమిషాల ఆలస్యంగా గమ్యానికి చేరింది. దీంతో ప్రయాణికుడు తాను శారీరక, మానసిక, ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నానని పేర్కొంటూ, ఇందుకు పరిహారంగా రూ. 4.5 లక్షల మొత్తాన్ని రైల్వేశాఖ చెల్లించాలని కోరుతూ, వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. తొలుత రైల్వేశాఖ వినియోగదారుని వాదనను తోసిపుచ్చింది. అయితే వినియోగదారుల ఫోరం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ కేసును పరిష్కరించింది.

## ఇమ్రాన్‌ఖాన్ సోదరి అలీమా ఖాన్ అరెస్ట్..



**న్యూఢిల్లీ సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
పాకిస్తాన్‌లో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్‌ను లాహోర్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆమెను లాహోర్‌లోని కోట్ లఖ్‌పత్ జైలుకు తరలించారు. లాహోర్‌లోని తన నివాసం నుంచి అలీమా ఖాన్‌ను స్థానిక పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె కారును, డ్రైవర్‌ను మజాంగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలీమా ఖాన్‌ను సెక్షన్ 3, ఎంపీఓ (మెయింటెనెన్స్ ఆఫ్ పబ్లిక్ ఆర్డర్) కింద పోలీసులు అరెస్టు చేశారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారిని ముందస్తుగా ఈ చట్టం కింద అరెస్టు చేస్తారు. అయితే, ఆమెను అరెస్టు చేయడానికి గల అసలైన కారణాలు మాత్రం ఇంకా వెల్లడికాలేదు. అలీమా ఖాన్ సోదరుడు ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం పాక్‌లోని రావల్పిండి జైలులో ఉన్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్ క్రికెట్ మాజీ కెప్టెన్, పాక్ మాజీ ప్రధాని అయిన ఇమ్రాన్ ఖాన్‌ను 2022 నుంచి జైలులో ఉంచారు. ఆయనకు జైలులో సరైన చికిత్స కూడా అందడం లేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల కోర్టు ఆర్డర్ రావడంతో ఇమ్రాన్ ఖాన్‌ను జైలు అధికారులు ఒక రోజు మాత్రమే ఆస్పత్రికి తరలించారు. ఈ సమయంలో ఇమ్రాన్ ఖాన్‌ను అలీమా ఖాన్ కలిశారు. ఇది జరిగిన కొద్ది రోజులకే అలీమా ఖాన్‌ను పాక్ పోలీసులు అరెస్టు చేయడం విశేషం. మరోవైపు ఇమ్రాన్ ఖాన్‌కు రావల్పిండిలోని అడియాలా జైలులో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్)కు చెందిన వైద్య బృందం ఈ పరీక్షలు ఇటీవల నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆరోగ్య స్థితికి సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉంది.

## బ్రిడ్జిపై నుంచి పడ్డ కారు.. ముగ్గురు మృతి

**ముంబై సెప్టెంబరు 20 నవ సంఘర్షణ**
ముంబైలోని కోస్టల్ రోడ్డు ప్రాంతంలో ఆదివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ బీఎండబ్ల్యూ కారు అతివేగంతో వచ్చి బ్రిడ్జి గోడను ఢీకొని.. ఆ తర్వాత బ్రిడ్జిపై నుంచి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో షనాయ్ గజ్జల్ (21), ధైర్య దర్శన్ సేథ్ (17), ఆదిత్య జకాస్నియా (19) అక్కడికక్కడే మృతి చెందారు. ఆదిత్య కల్పేశ్వర్ ఓస్వాల్ (23) తీవ్ర గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. మెరైన్ డ్రైవ్ నుంచి హాజిఅలీ వైపు వీరు అతివేగంతో వెళ్తుండగా కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగినట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు.



# బిజినెస్

## బియ్యం ధరలకు రెక్కలు..
## మూడు నెలల్లో భారీ పెరుగుదల

తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా నంద్యాల, కర్నూలు ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన సోనా రకాల బియ్యం ధరలు గత మూడు నెలల్లో గణనీయంగా పెరిగాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. మార్కెట్‌లో వరి ధాన్యం సరఫరా తగ్గడం, బియ్యానికి డిమాండ్ పెరగడం వంటి కారణాలతో ధరలు వరుసగా పైకి కదులుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. 50 కేజీల నంద్యాల సోనా బస్తా ధర మూడు నెలల క్రితం రూ. 2,600గా ఉండగా.. ప్రస్తుతం రూ. 3,800కు చేరింది. అంటే ఒక్క బస్తాపై ఏకంగా రూ. 1,200 వరకు పెరిగింది. అదే విధంగా కర్నూలు సోనా బియ్యం ధర కూడా భారీగా పెరిగింది. మూడు నెలల క్రితం 50 కేజీల బస్తా రూ. 2,400 ఉండగా.. ప్రస్తుతం రూ. 3,500కు చేరింది. ఈ రకంలోనూ బస్తాపై రూ. 1,100 వరకు ధర పెరిగింది. ఇక ఇటీవల ధరల పెరుగుదల మరింత వేగం పుంజుకుంది. గత పది రోజుల్లోనే బియ్యం బస్తాపై సుమారు రూ. 500 వరకు ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. తక్కువ వ్యవధిలోనే ఇంత భారీగా ధరలు పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నిత్యావసర



వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బియ్యం ధరలు కూడా పెరగడం కుటుంబాల నెలవారీ ఖర్చులపై ప్రభావం చూపుతోంది. వరి సాగుపై వాతావరణ పరిస్థితుల ప్రభావం కూడా బియ్యం ధరల పెరుగుదలకు కారణమవుతోందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, దాని ప్రభావంతో వరి సాగు తగ్గడం వల్ల మార్కెట్‌కు వచ్చే ధాన్యం పరిమాణం తగ్గిందని చెబుతున్నారు. సరఫరాతో పోలిస్తే బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధరలు పెరుగుతున్నాయని వివరిస్తున్నారు. మరోవైపు మార్కెట్‌లో బియ్యానికి డిమాండ్ కొనసాగుతోంది. నాణ్యమైన సోనా రకాల బియ్యానికి వినియోగదారుల నుంచి ఎక్కువగా డిమాండ్ ఉండటంతో వాటి ధరలు ఇతర రకాలతో పోలిస్తే వేగంగా పెరుగుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ధాన్యం కొనుగోలు ధరలు పెరగడం, రవాణా, మిల్లింగ్ తదితర ఖర్చులు కూడా తుది ధరపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులను పరిశీలిస్తే బియ్యం ధరలు తక్షణంగా తగ్గే అవకాశాలు కనిపించడం లేదని వ్యాపారులు అంటున్నారు. వర్షపాతం, వరి సాగు, ధాన్యం దిగుబడి, మార్కెట్‌కు వచ్చే సరఫరా వంటి అంశాలపై రానున్న రోజుల్లో ధరల తీరు ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. సరఫరా పెరగకపోతే, డిమాండ్ ఇదే స్థాయిలో కొనసాగితే బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బియ్యం ధరల పెరుగుదలతో వినియోగదారులు కూడా ఆచితూచి కొనుగోళ్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా నంద్యాల, కర్నూలు సోనా వంటి ఎక్కువగా వినియోగించే రకాల ధరలు పెరగడంతో నెలవారీ బియ్యం కొనుగోలు ఖర్చు గణనీయంగా పెరుగుతోంది. రానున్న రోజుల్లో మార్కెట్‌లో సరఫరా పరిస్థితి ఎలా ఉంటుందో, వర్షాలు ఏ మేరకు కురుస్తాయో బియ్యం ధరలపై కీలక ప్రభావం చూపనుంది.

## ముడిచమురు మంట..
## భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా?




మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రాంతంలో చమురు రవాణాకు అంతరాయం ఏర్పడటంతో ముడిచమురు సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలపై ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ సహా పలు దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పటికే పెరిగినట్లు సమాచారం. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పైనా పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు గణనీయంగా పెరిగితే దేశీయంగా ఇంధన ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది. భారత్ తన ముడిచమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటున్న నేపథ్యంలో అంతర్జాతీయ ధరల మార్పులు దేశీయ ఇంధన రంగంపై ప్రభావం చూపుతాయి. ముడిచమురు ధరలు పెరిగితే పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు రవాణా వ్యయాలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇంధన ధరలు పెరగడం వల్ల సరుకు రవాణా ఖర్చులు అధికమై, కూరగాయలు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీంతో ఇప్పటికే ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులపై అదనపు భారం పడే అవకాశముంది. అయితే అంతర్జాతీయ ముడిచమురు ధరల పెరుగుదల ఎంతకాలం కొనసాగుతుంది, హర్మూజ్ జలసంధి వద్ద పరిస్థితులు ఎప్పుడు సాధారణ స్థితికి వస్తాయి, ప్రపంచ మార్కెట్‌లో చమురు సరఫరా ఏ మేరకు కొనసాగుతుంది వంటి అంశాలపై భారత్‌లో ఇంధన ధరల భవిష్యత్ పరిణామాలు ఆధారపడి ఉంటాయి. పరిస్థితులు తీవ్రతరం అయితే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలపై మరింత ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## జియో నుంచి రూ.51కే 5జీ ప్లాన్.. 3జీబీ అదనపు డేటా

ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం రిలయన్స్ జియో తక్కువ ధరకే 5జీ డేటా ప్రయోజనాన్ని అందించే రూ. 51 యాడ్‌ఆన్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే రోజుకు 1.5జీబీ డేటా ప్రయోజనం ఉన్న ప్రీపెయిడ్ ప్లాన్‌ను ఉపయోగిస్తున్న వారికి ఈ యాడ్‌ఆన్ ద్వారా అపరిమిత 5జీ డేటాను పొందే అవకాశం ఉంటుంది. రూ. 51 ప్లాన్‌తో వినియోగదారులకు 3జీబీ అదనపు డేటా లభిస్తుంది. అయితే ఈ ప్లాన్‌ను విడిగా రీఛార్జ్ చేసుకుని 5జీ సేవలను పొందడం సాధ్యం కాదు. ఇప్పటికే రోజుకు 1.5జీబీ డేటా అందించే, కనీసం 30 రోజుల వ్యాలిడిటీ ఉన్న జియో ప్రీపెయిడ్ ప్లాన్ యాక్టివ్‌గా ఉండాలి. అలాంటి వినియోగదారులు రూ. 51




యాడ్‌ఆన్‌ను రీఛార్జ్ చేసుకుంటే అపరిమిత 5జీ డేటా ప్రయోజనం పొందవచ్చు. ఈ యాడ్‌ఆన్ ప్లాన్ వ్యాలిడిటీ కూడా వినియోగదారుడి ప్రస్తుత ప్రీపెయిడ్ ప్లాన్ వ్యాలిడిటీకి అనుగుణంగా ఉంటుంది. అంటే ప్రధాన ప్లాన్ గడువు ముగిసే వరకు ఈ అదనపు ప్రయోజనం అందుబాటులో ఉంటుంది. అయితే అపరిమిత 5జీ ప్రయోజనం పొందాలంటే వినియోగదారుడి ప్రాంతంలో జియో 5జీ సేవలు అందుబాటులో ఉండటంతో పాటు 5జీ కి అనుకూలమైన ఫోన్ ఉండాలి. తక్కువ ధరకే అదనపు డేటా అవసరమయ్యే వినియోగదారులకు ఈ రూ. 51 యాడ్‌ఆన్ ఉపయోగకరంగా ఉండనుంది. ముఖ్యంగా 5జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ డేటాను వినియోగించే వారికి ఇది ప్రయోజనం కల్పించనుంది.

## షఫాలి శతకమోత..
## బంగ్లాపై భారీ విజయంతో ఫైనల్లో భారత్..!

ఆసియా క్రీడలు-2026 మహిళల క్రికెట్‌లో భారత జట్టు అదరగొట్టింది. ఆదివారం జరిగిన రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై 114 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత ఓపెనర్ షఫాలీ వర్మ విధ్వంసకర శతకంతో చెలరేగగా.. భారత బౌలర్లు ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే ఆలౌటైంది.

**షఫాలీ సునామీ.. 49 బంతుల్లో శతకం**

భారత విజయంలో షఫాలీ వర్మ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కేవలం 49 బంతుల్లోనే 100 పరుగులతో అజేయంగా నిలిచిన ఆమె.. 3 ఫోర్లు, 9 సిక్సర్లతో బంగ్లాదేశ్ బౌలర్లపై విరుచుకుపడింది. చివరి బంతికి సిక్సర్ బాది శతకం పూర్తి చేసింది. ఇది షఫాలీకి టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి శతకం. ఆసియా క్రీడల క్రికెట్ చరిత్రలో శతకం సాధించిన తొలి క్రికెటర్‌గా కూడా ఆమె రికార్డు సృష్టించింది.

**మంధాన, హర్మన్‌ప్రీత్ కీలక భాగస్వామ్యాలు**

షఫాలీకి ఓపెనర్ స్మృతి మంధాన మంచి సహకారం అందించింది. మంధాన 19 బంతుల్లో 37 పరుగులు చేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 72 పరుగులు జోడించి భారత్‌కు శుభారంభం అందించారు.




అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులు చేసి షఫాలీతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపింది. చివర్లో షఫాలీ వేగం పెంచడంతో భారత్ 195 పరుగుల భారీ స్కోరు సాధించింది.

**బంగ్లా బ్యాటర్లకు భారత బౌలర్ల దెబ్బ**

196 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ ఏ దశలోనూ పోటీనివ్వలేకపోయింది. భారత బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ ప్రత్యర్థి బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చారు. నందిని శర్మ, దీప్తి శర్మ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. దీంతో బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే ఆలౌటైంది. భారత్ 114 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది.

**శ్రీలంకతో పసిడి పోరు**

ఈ విజయంతో భారత్ వరుసగా రెండోసారి ఆసియా క్రీడల మహిళల క్రికెట్ ఫైనల్‌కు చేరింది. తొలి సెమీఫైనల్లో శ్రీలంక విజయం సాధించడంతో తుది పోరులో భారత్, శ్రీలంక తలపడనున్నాయి. సెప్టెంబర్ 22న జరగనున్న ఫైనల్లో విజేతకు స్వర్ణ పతకం దక్కనుంది.

# స్పోర్ట్స్

## స్మృతి మంధాన సంచలనం!

**టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు..**

భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీ20 క్రికెట్‌లో అరుదైన ప్రపంచ రికార్డు సృష్టించింది. పురుషులు, మహిళల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌ను కలిపి అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా మంధాన నిలిచింది. ఆసియా క్రీడల్లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకుంది. ఈ



మ్యాచ్‌లో మంధాన 19 బంతుల్లో 37 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఈ క్రమంలో న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ సూజీ బేట్స్ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. మ్యాచ్‌కు ముందు మంధాన 170 ఇన్నింగ్స్‌ల్లో 4,751 పరుగులతో రెండో స్థానంలో ఉంది. ప్రపంచ రికార్డును బద్దలు కొట్టేందుకు ఆమెకు మరో 8 పరుగులు మాత్రమే అవసరమయ్యాయి. ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు ఫోర్లు, రెండు సింగిల్స్ సాధించి ఆ మార్కును అందుకుంది. ఈ రికార్డుతో మంధాన 171 ఇన్నింగ్స్‌ల్లో 4,788 పరుగులతో టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అగ్రస్థానానికి చేరింది. ఇప్పటివరకు ఈ రికార్డు సూజీ బేట్స్ పేరిట ఉండేది. ఆమె 4,758 పరుగులతో రెండో స్థానానికి పరిమితమైంది. పురుషుల టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన పాకిస్థాన్ ఆటగాడు బాబర్ ఆజం 4,596 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ ఆటగాడు జోస్ బట్లర్ 4,292 పరుగులతో నాలుగో స్థానంలో, భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 4,287 పరుగులతో ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మంధానకు ఈ రికార్డు మరో మైలురాయిగా నిలిచింది. పురుషుల క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లను వెనక్కి నెట్టి టీ20ల్లో అత్యధిక పరుగుల జాబితాలో అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. ఇక బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. మంధానతో పాటు షఫాలీ వర్మ కూడా ధాటిగా ఆడటంతో భారత జట్టుకు మంచి ఆరంభం లభించింది. షఫాలీ వర్మ అజేయ శతకంతో చెలరేగడంతో భారత్ భారీ స్కోరు సాధించింది. అనంతరం భారత బౌలర్లు బంగ్లాదేశ్ బ్యాటర్లను కట్టడి చేసి భారత్‌కు ఘన విజయం అందించారు. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన భారత మహిళల జట్టు.. ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్‌లో ఆతిథ్య జపాన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరిన భారత్.. బంగ్లాదేశ్‌పై విజయంతో ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మంధాన రికార్డు ఈ విజయానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

## అబ్బాయిల జైత్రయాత్ర.. అమ్మాయిలకు బ్రేక్

సమర్‌కండ్

చెస్ ఒలింపియాడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత్ ఐదో రౌండ్‌లోనూ అదే జోరు కొనసాగించింది. ఓపెన్ కేటగిరీలో భారత్ 3-1తో హాలండ్‌పై గెలిచి వరుసగా ఐదో విజయాన్ని నమోదుచేసింది. ప్రజ్ఞానంద.. అనీష్ గిరిని ఓడించగా జోర్డెన్ వాన్ ఫారెస్ట్‌తో మ్యాచ్‌ను అర్జున్ డ్రా చేసుకున్నాడు. నిహాల్ సైతం వాన్ విలీతో పాయింట్‌ను పంచుకోగా గుకేశ్.. ఎర్విన్‌ను ఓడించాడు. కానీ మహిళల విభాగంలో భారత్‌కు 1.5-2.5తో పోలండ్ షాకిచ్చింది. హంపి, దివ్య, వంతిక మ్యాచ్‌లు డ్రా గా తేలగా వైశాలి ఓటమిపాలైంది.



# అడవి నేపథ్యంలో వైల్డ్ యాక్షన్‌తో సత్యదేవ్.. 'సమవర్తి' టీజర్ రిలీజ్




వర్సటైల్ ట్యాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'సమవర్తి'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక టీజర్‌ను లాంచ్ చేశారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ టీజర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో తీవ్ర చర్చనీయాంశమైంది.ప్రకృతికి, మానవులకు మధ్య నడిచే సంఘర్షణ, అడవుల అక్రమ నరికివేత, గిరిజనుల జీవన విధానం వంటి సరికొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టీజర్ ఆరంభంలో వచ్చే వైవిధ్యమైన వాయిస్ ఓవర్ కథపై ఆసక్తిని కలిగిస్తుంది. ఇక ఈ చిత్రంలో 'మహాదేవ్' అనే వైల్డ్ అండ్ రగ్డ్ పాత్రలో సత్యదేవ్ కనిపించనున్నారు. ఆయన గెటప్, తెలంగాణ యాసలో చెప్పే పవర్‌ఫుల్ డైలాగులు, ముఖ్యంగా టీజర్ ముగింపులో వచ్చే "ఈసారి మిస్ అవ్వదు" అనే డైలాగ్ సినిమాపై హైప్‌ను తారాస్థాయికి చేర్చాయి. అడవులు, ప్రత్యేకమైన లొకేషన్లలో అత్యంత సహజసిద్ధంగా తెరకెక్కించిన విజువల్స్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. చివరిలో చూపించిన పులి ఎంట్రీ సీన్ మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఇందులో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్ వంటి ప్రముఖ తారాగణం నటిస్తోంది. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని రుద్ర పిక్చర్స్ మరియు పంచభూత ప్రొడక్షన్స్ సంస్థలు అత్యున్నత నిర్మాణ విలువలతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.

# సమంత స్థానంలో?



సినిమాల్లో కథానాయికల మార్పు సాధారణమే. అయితే ఓ అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లో ఓ నాయిక స్థానాన్ని మరొకరు భర్తీ చేయడం మాత్రం చాలా అరుదు. ఇప్పుడు అలాంటి మార్పే 'చెన్నై స్టోరీ' విషయంలో జరిగినట్లు తెలుస్తున్నది. ఈ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్‌లో తొలుత సమంతను కథానాయికగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు విరామం తీసుకుంటున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో సమంత స్థానంలో శృతిహాసన్‌ను కథానాయికగా ఎంపిక చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. బాఫ్టా అవార్డు విజేత, డౌన్‌టౌన్ అబ్బే వంటి సినిమాలతో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్న ఫిలిప్‌జాన్ దర్శకత్వంలో 'చెన్నై స్టోరీ' తెరకెక్కుతున్నది. టిమెరి ఎన్ మురారి రచించిన 'ది అరెంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. చెన్నై, ఇంగ్లాడ్‌లోని వేల్స్ నేపథ్యంలో సాగే ఈ కథలో కథానాయిక ప్రైవేట్ డిటెక్టివ్ పాత్రలో కనిపించనుంది. అయితే ఈ సినిమా నుంచి సమంత తప్పుకున్న విషయాన్ని అధికారికంగా ధృవీకరించలేదు. అంతర్జాతీయ నటీనటులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

# అక్టోబర్‌లో వస్తున్న 'కల్ట్'



విశ్వక్‌సేన్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'కల్ట్' చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. సందీప్ కాకర్ల నిర్మాత. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో స్లాషర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. శనివారం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా కొత్త గ్లింప్స్‌ను విడుదల చేశారు.ఇందులో హీరో విశ్వక్‌సేన్ ఇంటెన్స్ లుక్స్‌తో నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో కనిపించారు. ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని మేకర్స్ తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, జపనీస్, స్పానిష్ భాషల్లో విడుదలకానున్న ఈ చిత్రానికి తరుణ్ భాస్కర్ సంభాషణలు అందిస్తుండగా, రవిబస్రూర్ సంగీతాన్ని సమకూర్చుతున్నారు.

# 'కదిరి కాళిదాస్'.. 'కాకా' నుంచి మెగాస్టార్ క్రేజీ అప్‌డేట్!



మెగాస్టార్ చిరంజీవి , మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి  కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా'. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా ఈ చిత్రంలో తన పాత్రకు సంబంధించి లీక్స్ ఇచ్చాడు చిరంజీవి. ఇటీవల జరిగిన ఓ సినిమా వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెగాస్టార్ చిరంజీవి, స్టేజ్ పై సరదాగా మాట్లాడుతూ తన పాత్రకు సంబంధించి కొన్ని ఆసక్తికర హింట్స్ ఇచ్చారు. ఈ చిత్రంలో ఆయన 'కదిరి కాళిదాస్' అలియాస్ 'సత్యం' అనే విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. పైకి సాధారణ ప్రజలకోసం ఓ ఆక్వా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేసే సాధారణ వ్యక్తిలా సత్యం కనిపిస్తారని, కానీ తెరవెనుక అండర్‌వాల్డ్‌ను శాసించే శక్తిగా 'కదిరి కాళిదాస్' రూపంలో ఆయన అసలు నిజస్వరూపం బట్టబయలవుతుందని సమాచారం. ఈ చిత్రంలో తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే బలమైన భావోద్వేగాలు కథకు ప్రధాన ఆత్మగా నిలవనున్నాయి. మలయాళీ నటి అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో నటిస్తుండగా, ఆమె మెడిసిన్ చదివే విద్యార్థినిగా కనిపించనుంది. వీరిద్దరి మధ్య నడిచే ఎమోషనల్ బాండింగ్ ప్రేక్షకులను కంటతడి పెట్టించడంతో పాటు సినిమాకే హైలైట్‌గా మారుతుందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అన్ని హంగులు పూర్తి చేసుకుని ఈ పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ పక్కా ప్రణాళికతో సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ కూడా రానుండటంతో మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అందానికి అమ్మమ్మ చిట్కా

'ఛలో' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన కన్నడ కస్తూరి రష్మిక మందన్న. ఈ ముద్దుగుమ్మ హీరో విజయ్ దేవరకొండను పెండ్లి చేసుకొని తెలంగాణ కోడలైంది. పుష్ప లాంటి బ్లాక్‌బస్టర్‌లో నటించిన రష్మిక తన భర్త విజయ్‌తో కలిసి 'రణబాలి'లో జతకట్టింది. ముచ్చటగా మూడోసారి దేవరకొండతో నటిస్తున్నా.. పెండ్లి తర్వాత ఈ జంట కలిసి చేస్తున్న మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా ఈ బ్యూటీ పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి..ఇటీవల షూటింగ్‌లో గాయపడటంతో ఇంటికే పరిమితమయ్యాను. ఇన్నిరోజులు ఇంట్లో ఉండటం నా కెరీర్‌లోనే మొదటిసారి అనుకుంటా. షూటింగ్‌ల వల్ల నిత్యం ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లే నాకు ఇదో కొత్త అనుభవం. పెండ్లయిన తర్వాత కూడా విజయ్, నేను మూడు నెలలపాటు ఒకరినొకరం చూసుకోలేదు. పెండ్లి తర్వాత ఇంట్లోవాళ్లతో గడిపే అవకాశం లభించినందుకు ఒకింత సంతోషంగా ఉంది .రణబాలితో పాటు 'మైసా'లో లీడ్ రోల్ చేస్తున్నాను. ఇందులో గోండు తెగకు చెందిన వారియర్‌లా కనిపిస్తాను. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కఠిన శిక్షణ తీసుకున్నాను. ఇందులో నీటి అడుగున శ్వాస బిగబట్టి చేసే యాక్షన్ సీన్ చేశాను. ఆసియాలోనే ఈ తరహా సీన్ చేసిన తొలి ఫీమెల్ యాక్టర్ నేనే అనుకుంటా. దేవరకొండ కుటుంబంలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. మా అత్త స్వీట్‌గా, పసిపాపలాగా అమాయకంగా ఉంటుందని నేను ముద్దుగా ఆమెను 'పాపా' అని పిలుస్తాను. విజయ్‌కు సీరియస్ డ్రామాలు, షోలంటే ఇష్టం. నాకేమో కొరియన్ డ్రామాలు అంటే పిచ్చి. ఇప్పుడు ఆయనకు కూడా కే-డ్రామాలు అలవాటు చేశాను. నా దృష్టిలో సక్సెస్ అంటే పర్‌ఫెక్ట్ ఇమేజ్ కాదు. ఎంత ఎదుగుతున్నా సరే మనం మనలా ఉంటూ ప్రేక్షకులతో నిజాయతీగా ఉండటమే. అలాంటి నిజాయతీని ఎప్పటికైనా ప్రేక్షకులు గుర్తిస్తారు. బిజీ షెడ్యూల్లో కాస్త తీరిక దొరికినప్పుడు స్కిన్, హెయిర్ కేర్ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను. గోరు వెచ్చని కొబ్బరి నూనెను ముఖానికి, తలకు పట్టించి చక్కగా మర్దనా చేసుకుంటా. ఏ మాయిశ్చరైజర్, హెయిర్ కండీషనర్ అవసరం లేదు. వీలు దొరికినప్పుడల్లా నేను ఇదే చేస్తా. ఇది మా అమ్మమ్మ, అమ్మ చెప్పిన చిట్కా.



# హనుమాన్ అంశ్' దర్శకుడి కొత్త సినిమా

ఇటీవల విడుదలైన ఆధ్యాత్మిక చిత్రం 'హనుమాన్ అంశ్'తో దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు దర్శకుడు విశాల్ చతుర్వేది. నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం 300కోట్లకు పైగా వసూళ్లతో భారతీయ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్నది.ఈ నేపథ్యంలో దర్శకుడు విశాల్ చతుర్వేది కొత్త చిత్రాన్ని ప్రకటించారు.. మహాకవి గోస్వామి తులసీదాస్ జీవిత కథతో ఆయన ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. దీనికి 'రాంబోలా- ది ఇమ్మోర్టల్ స్టోరీ ఆఫ్ గోస్వామి తులసీదాస్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. తులసీదాస్ జీవిత ప్రయాణం, సాహిత్య సేవ, సమాజంపై ఆయన ప్రభావం వంటి అంశాలను చర్చిస్తూ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు